నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, ఆదివారం 20 అక్టోబర్ 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

పాలకుర్తి పోలీస్‌స్టేషన్ ఎదుట మృతదేహాన్ని దహనం చేస్తామని కట్టెలు వేసి నిరసన తెలుపుతున్న బంధువులు

చక్కదిద్దాల్సింది పోయి చంపేశారు..!

'పవర్'కు తలొగ్గి ఖాకీల అత్యుత్సాహం

అధికారానికి తలొగ్గిన ఖాకీల అతి ప్రవర్తనకు ఓ గిరిజన యువకుడు బలయ్యాడు. పెళ్లయి ఏడాది కూడా కాని భార్యాభర్తల నడుమ వచ్చిన చిన్న గొడవను సర్దిచెప్పి చక్కదిద్దాల్సింది పోయి, అధికార పార్టీ నేత ఒత్తిడికి తలొగ్గి ఆ యువకుడిని పోలీస్‌స్టేషన్‌లో బంధించి విచక్షణారహితంగా కొట్టడంతో దెబ్బలకు తాళ లేక అవమానం తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే, ఇందుకు కారకులైన పోలీసులపై చర్యలు తీసుకోకుండా ఆ కుటుంబానికి ఆర్థికంగా భరోసా ఇచ్చారే తప్ప.. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది.

- సుబేదారి, అక్టోబర్ 19

- **అధికార పార్టీ నేత ఒత్తిడితో గిరిజన యువకుడిపై పాలకుర్తి పోలీసుల ప్రతాపం**
- **దెబ్బలు తాళ లేక.. అవమానం భరించలేక..**
- **ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం**
- **ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతూ మృతి**
- **అధికార పార్టీకి అంటకాగి.. పోలీసుల కాఠిన్యం**
- **ఇంత జరిగినా పోలీసు అధికారులపై చర్యలు శూన్యం**
- **రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన ఘటన**

పాలకుర్తి ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువుల కథనం ప్రకారం.. పాలకుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొండాపురం శివారు మేకలతండాకు చెందిన గిరిజన యువకుడు లకావత్ శ్రీను(22)కు అతడి భార్య సరోజకు మధ్య కొద్దిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం భార్య పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె దగ్గరి బంధువుకు పరిచయమున్న అధికార పార్టీకి చెందిన స్థానిక నేత పోలీసులపై ఒత్తిడి తేవడంతో పోలీసులు శ్రీనును స్టేషన్‌లో బంధించి కొట్టారు. ఆ తర్వాత సరోజ దగ్గరి బంధువు కూడా స్టేషన్ ముందే శ్రీనును చితకబాదాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీనివాస్ పోలీసుల బెదిరింపులతో పాటు మళ్లీ కొడుతారన్న భయంతో శుక్రవారం పాలకుర్తి స్టేషన్‌కు వచ్చి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. గిరిజన యువకుడి మృతి కారకులైన ఇన్‌స్పెక్టర్, ఎస్సైపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘాలు, బంధువులు పెద్దఎత్తున పాలకుర్తి స్టేషన్‌కు తరలివచ్చి ధర్నా చేశారు. దీంతో డీసీపీ స్థాయి అధికారి మృతుడి కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా వరంగల్ ఎంజీఎం దవాఖాన నుంచి శ్రీను మృతదేహాన్ని అంబులెన్స్‌లో కుటుంబ సభ్యులు సొంతూరికి తీసుకెళ్తుండగా హనుమకొండ హంటర్‌రోడ్డులో పోలీసులు అడ్డుకున్నారు. రోడ్డుపై పెద్ద ఎత్తున పోలీసు బలగాలు మోహరించాయి. అయితే, పాలకుర్తిలో పరిస్థితి అదుపులోనే ఉండడంతో హంటర్‌రోడ్డు నుంచి శ్రీను మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించడానికి పోలీసు ఉన్నతాధికారులు అనుమతించారు.

హద్దు మీరి ప్రవర్తన

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న కొందరు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు తమ హద్దు మీరి ప్రవర్తిస్తున్నారు. అధికార పార్టీ నేతలకు అంటకాగుతున్నారు. వారు చెప్పినట్లు నడుచుకుంటూ సామాన్యులపై కాఠిన్యాన్ని ప్రదర్శిస్తున్నారు. పోలీసు శాఖ పరువును తుంగలో తొక్కుతున్నారు. ఇటీవల వరంగల్ నగరంలోని తూర్పు నియోజకవర్గంలో ఓ పోలీసు అధికారి వైఖరిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, తాజాగా, పాలకుర్తిలో గిరిజన యువకుడి ఆత్మహత్యకు కారణమైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోకపోవడంతో పోలీసు ఉన్నతాధికారులపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పరకాల నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులను నిర్బంధించి కొట్టిన కేసులో పోలీసు అధికారులపై విచారణ జరుగుతుండగానే, కొందరు పోలీసు అధికారులు బాధితులను బెదిరిస్తున్నా ఎలాంటి పట్టింపు లేదు. కొందరు ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పోలీస్ శాఖ నిబంధనలు అతిక్రమించి, ఉన్నతాధికారుల ఆదేశాలను తుంగలో తొక్కి పోస్టింగ్ ఇప్పించిన అధికార పార్టీ నేతల కనుసన్నల్లో పనిచేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. సివిల్ వివాదాలు, కుటుంబ వ్యవహారాల్లో జోక్యం చేసుకొని, బాధితులపైనే తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

బాధ్యులపై చర్యలేవి?

గిరిజన యువకుడిని స్టేషన్‌లో బంధించి విచక్షణారహితంగా కొట్టి, అతడి ఆత్మహత్యకు కారకులైన పాలకుర్తి పోలీసు అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సమస్య మరింత జఠిలం కాకుండా ఆర్థికంగా ఆదుకుంటామని మృతుడి కుటుంబానికి హామీ ఇచ్చారు తప్ప.. బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు మాత్రం తీసుకోవడం లేదని గిరిజన సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీ నేతలకు తలొగ్గి, సామాన్యులపై ప్రతాపం చూపిస్తారా అని మండిపడుతున్నారు.

పాలకుర్తి పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న ప్రజా సంఘాలు గిరిజన సంఘాల నాయకులు బంధువులు

పాలకుర్తిలో ఉద్రిక్తం

ఎంజీఎంలో చికిత్స పొందుతూ శ్రీను మృత్యువాత

మృతి చెందిన లకావత్ శ్రీను (ఫైల్)



ఎంజీఎం మార్చురీ వద్ద మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

- **పోలీస్‌స్టేషన్ ఎదుట బంధువులు, తండావాసులు, గిరిజన, ప్రజా సంఘాల ధర్నా**
- **ఎస్సై, సీఐని సస్పెండ్ చేయాలని డిమాండ్**

పాలకుర్తి రూరల్, అక్టోబర్ 19 : పాలకుర్తి మండలం కొండాపురం శివారు మేకలతండాకు చెందిన లకావత్ శ్రీను(22) మృతితో ఒక్కసారిగా పాలకుర్తిలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. బంధువులు, తండావాసులతోపాటు గిరిజన ప్రజాసంఘాలు, సీపీఐ, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ ఎదుట సుమారు 5 గంటలపాటు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. మేకల తండవాసులు, బంధువుల పెద్ద ఎత్తున తరలివచ్చి శ్రీను కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. శ్రీను మృతికి కారణమైన ఎస్సై, సీఐని సస్పెండ్ చేయడంతోపాటు పోలీసులపై ఒత్తిడి తెచ్చి ఎస్సై సాయి ప్రసన్నకుమార్‌తో శ్రీనును కొట్టించిన పాలకుర్తి మాజీ సర్పంచ్ వీరమనేని యాకాంతారావుపై కేసులు నమోదు చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి గుమ్మడిరాజుల సాంబయ్య, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు బానోత్ మహేందర్, ధరావత్ రాజేశ్‌నాయక్, లకావత్ నాగరాజు, వెంకట్ డిమాండ్ చేశారు. ఆందోళనకారులు, పోలీసులకు మధ్య తొపులాట జరిగి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ ఆధ్వర్యంలో కమిషనరేట్ ఏసీపీలు, సీఐలు, ఎస్సై ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ ఎదుట భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. మృతదేహాన్ని పోలీస్‌స్టేషన్ ఎదుటే కాలబెడతామని బంధువులు కట్టెలు తెచ్చి నిప్పంటించారు. జనగామ డీసీపీ కలెక్టర్ షేక్‌రిజ్వాన్ బాషాతో ఫోన్‌లో ప్రజా, గిరిజన సంఘాల నాయకులతో మాట్లాడించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున ఎక్స్‌గ్రేషియా అందేలా కృషి చేస్తానని, బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. సంబంధిత అధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కలెక్టర్‌తోపాటు జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ మాట్లాడుతూ.. శ్రీను మృతికి కారణమైన ఆరుగురిపై కేసు నమోదు చేశామని చెప్పారు. ఘటనకు బాధ్యులైన సంబంధిత అధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు ధర్నా విరమించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సింగారపు రమేశ్, రాపర్తి సోమయ్య, చిట్యాల సోమన్న ఘటనకు బాధ్యులైన ఎస్సై, సీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా, మూడెకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ నాయకుడిని కాపాడే ప్రయత్నంలో పోలీసులు

శ్రీను మృతికి కారణమైన కాంగ్రెస్ నాయకుడిపై కేసు పెట్టకుండా కాపాడే ప్రయత్నంలో పోలీసులు ఉన్నారని కుటుంబసభ్యులు, బంధువులు ప్రజా, గిరిజన సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. శ్రీను మృతికి కారణమైన కాంగ్రెస్ నాయకుడు, పాలకుర్తి మాజీ సర్పంచ్ వీర మనేని యాకాంతారావు, హుస్సేన్‌పై కేసు నమోదు చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి సాంబయ్య, గిరిజన సంఘాల నాయకుడు మహేందర్‌నాయక్ డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ముగిసిన అంత్యక్రియలు

శ్రీను అంత్యక్రియలు స్వగ్రామమైన మేకలతండాలో శనివారం రాత్రి ముగిశాయి. శ్రీను మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం దవాఖాన నుంచి వయా వర్ధన్నపేట, జఫర్‌గఢ్ మీదుగా బమ్మెర పెద్దతండా బీ నుంచి మేకల తండాకు తీసుకొచ్చారు. ఈ క్రమంలో పెద్దతండా బీ వద్ద మేకల తండావాసులకు పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ గిరిజన సంఘాల నాయకులు, తండావాసులతో మాట్లాడి రాజీ కుదిర్చి, శ్రీను కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. దీంతో తండావాసులు శ్రీను మృతదేహాన్ని మేకలతండాకు తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు. పోలీసులు భారీగా మోహరించారు.

ఆరుగురిపై కేసు నమోదు

లకావత్ శ్రీను సోదరుడు సోమన్న ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. టీఎస్‌కేతండాకు చెందిన గుగులోత్ హుస్సేన్, గుగులోత్ విజయ, నర్సింగపురం తండాకు చెందిన మాలోత్ వినోద్, భూక్యా మహేశ్, మాలోత్ మంగ్తి, నూనావత్ గణేశ్‌పై కేసు నమోదు చేశామన్నారు.

పాలకుర్తి పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకారులను అడ్డుకుంటున్న పోలీసులు



అన్నదాత కోసం బీఆర్ఎస్ పోరు..

అన్నదాతల కోసం బీఆర్ఎస్ మరో పోరుకు సిద్ధమైంది. వానకాలం సీజన్‌లో రైతు భరోసా ఇవ్వమంటూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేసిన వ్యాఖ్యలు, రైతుభరోసా ఎగ్గొట్టి రైతులను మోసం చేసిన కాంగ్రెస్ సర్కారు తీరును ఎండగట్టాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు నేడు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించనున్నది. ఈ మేరకు మాజీ మంత్రులు, అన్ని జిల్లాల బీఆర్ఎస్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు ఎక్కడికక్కడ నిరసనలకు సిద్ధమవుతుండగా పెద్ద సంఖ్యలో రైతాంగం తరలివచ్చి కదంతొక్కనున్నది.

- హనుమకొండ, అక్టోబర్ 19

- **రైతుభరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్‌పై నిరసనలు**
- **నేడు అన్ని మండలకేంద్రాల్లో కార్యక్రమాలు**
- **రేవంత్ సర్కారు తీరును ఎండగట్టాలి**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు**
- **కదంతొక్కనున్న రైతాంగం**

రైతులకు ఇవ్వాల్సిన రైతుభరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఆదివారం ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలకేంద్రాల్లో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు నిరసనలు చేపట్టాలని బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. గత ప్రభుత్వం ఎకరాకు రూ.10వేలు(రెండు సీజన్లు కలిపి) ఇస్తే తాము ఎకరాకు రూ.15వేల రైతుభరోసా ఇస్తామని చెప్పి రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరును, వరుస ద్రోహాలను ఎండగట్టేందుకు రైతాంగం నేడు కదంతొక్కనున్నది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం రైతాంగాన్ని ఆదుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వం క్రమం తప్పకుండా ఖరీఫ్, యాసంగి సీజన్లలో ఎకరాకు రూ.5వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమచేసేది. అయితే గత ప్రభుత్వం కంటే పెంచి రూ.15వేలు ఇస్తామని ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చి ఇప్పుడు ఎగవేత ధోరణిలో స్వయంగా వ్యవసాయ శాఖ మంత్రే మాట్లాడిన నేపథ్యంలో రైతాంగానికి అండగా నిలువాలని భావించింది. ఈక్రమంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను రైతాంగానికి గుర్తు చేయడంతో పాటు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు తలపెట్టిన నిరసనలు విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది.

కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు..

- **'రైతుబంధు'కు రాంరాం అన్న కేసీఆర్ మాట అక్షర సత్యమైంది..**
- **మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల, అక్టోబర్ 19: కాంగ్రెస్ గెలిస్తే 'రైతుబంధు'కు రాంరాం చెబుతారన్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్న మాటలు నేడు అక్షర సత్యమమయ్యాయని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జనగామ జిల్లా దేవరుప్పులలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వానకాలం సీజన్‌లో రైతుబంధుకు ప్రభుత్వం ఎగనామం పెట్టడమంటే తెలంగాణ రైతాంగాన్ని మోసం చేయడమేనన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అమలుకాని హామీలిచ్చి ప్రజలతో ఓట్లేయించుకున్న రేవంత్‌రెడ్డి హామీలను అటకెక్కించడంతో నేడు ప్రజలకు ఆయన మాటల్లోని పరమార్థం బోధపడిందన్నారు. ప్రభుత్వానికి అప్పు పుట్టకపోవడంతోనే రైతులకు రుణమాఫీ, రైతుబంధు సాయం వేయలేకపోతున్నామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వ్యాఖ్యానించడం సిగ్గుచేటని దయాకర్‌రావు మండిపడ్డారు. ఆరు గ్యారెంటీల అమలును వాయిదా వేసినప్పుడే కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనం బయటపడిందన్నారు. రైతుభరోసా అందక రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని ఎర్రబెల్లి తెలిపారు. సబ్ కమిటీ, గైడ్‌లైన్స్ పేర కాలయాపన చేసి రైతుబంధు ఎగ్గొట్టాలని చూస్తున్న కాంగ్రెస్ సర్కారుకు రైతులు గుణపాఠం చెబుతారని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు పెట్టబడి సాయం అందక, విత్తనాలు, ఎరువులు లభించక నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేసీఆర్ ఎకరాకు రూ.10 వేలు ముష్టి ఇస్తున్నారని, తమ ప్రభుత్వం వస్తే రూ.15వేలు అందిస్తామన్న సిపాయి నేడు తలకాయ ఎక్కడ పెట్టుకుంటాడని ఎర్రబెల్లి ప్రశ్నించారు. రైతులతో చెలగాటమాడితే ప్రభుత్వం మాడిమసికాక తప్పదని హెచ్చరించారు. రైతులకు రైతుబంధు ఎగ్గొట్టి, కొందరికి రుణమాఫీ చేసిన ప్రభుత్వం అందరికీ రుణమాఫీ చేశామంటూ సంబురాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈసారి రైతుబంధు వేయకపోతే ప్రజాప్రతినిధులను ఘెరావ్ చేస్తామని అన్నారు. ప్రజాసమస్యలపై అడుగుగడుగునా నిలదీస్తూ ప్రభుత్వ వైఖరిని ఎండగడతామని ఎర్రబెల్లి అన్నారు.

ఎంజీఎం మార్చురీ వద్ద మాజీ మంత్రి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

కాంగ్రెస్ నాయకులపై అట్రాసిటీ కేసులు పెట్టాలి

- **రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి**
- **మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

వరంగల్ చౌరస్తా, అక్టోబర్ 19 : భార్యాభర్తల తగాదాలో తలదూర్చి కుటుంబ విలువలను, బంధుత్వాలను తెంచేలా వ్యవహరించిన కాంగ్రెస్ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. వరంగల్ ఎంజీఎం మార్చురీలో లకావత్ శ్రీను మృతదేహాన్ని శనివారం ఆయన సందర్శించి నివాళులర్పించి, మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చారు. కుటుంబ తగాదా విషయంలో కౌన్సెలింగ్ నిర్వహించి పరిస్థితిని చక్కదిద్దాల్సిన పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు చెప్పినట్లు పోలీసులు శ్రీనును వేధింపులకు గురిచేయడంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎర్రబెల్లి తెలిపారు. ఇది నూటికి నూరు శాతం కాంగ్రెస్ నాయకులు చేసిన హత్య అని అన్నారు. అధికారం శాశ్వతమని భావిస్తున్న కాంగ్రెస్ నాయకులు శ్రీను మృతితోనైనా కళ్లు తెరవాలని హితవు పలికారు. తన నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఏ ఒక్క రోజూ తాను పోలీసులను అడ్డుపెట్టుకొని కుట్రలు చేయలేదన్నారు. కేసును తప్పుదోవ పట్టించిన పోలీసు అధికారులతో పాటు వారి విధులకు ఆటంకం కల్పించిన కాంగ్రెస్ నాయకులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఆయన వెంట మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి పరామర్శ

వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతి చెందిన లకావత్ శ్రీను కుటుంబసభ్యులను పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి పరామర్శించి, తన సానుభూతి తెలియజేశారు. కుటుంబసభ్యులతో మాట్లాడి జరిగిన ఘటనపై అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుటుంబానికి రూ.15 వేల ఆర్థికసాయం అందించి, కుటుంబానికి అండగా ఉంటామని ఆమె హామీ ఇచ్చారు.

శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

పట్టాలిస్తారా ? చావమంటారా?

- **డబుల్‌బెడ్రూం ఇండ్లు కేటాయించి ఏడాదైనా పట్టాలివ్వని అధికారులు**
- **విసుగెత్తి తాళాలు పగులగొట్టి ఇళ్లలోకి వెళ్లిన లబ్ధిదారులు**
- **భూపాలపల్లి భాస్కర్‌గడ్డలో వంటావార్పు**

తమకు కేటాయించిన ఇండ్లలోకి వెళ్లేందుకు తాళాలు పగులగొడుతున్న లబ్ధిదారులు

కృష్ణకాలనీ, అక్టోబర్ 19 : బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసి ఏడాది గడిచినా నేటికీ పట్టాలివ్వకపోవడంతో విసిగిపోయిన నిరుపేదలు డబుల్‌బెడ్‌రూం ఇళ్ల తాళాలు పగులగొట్టి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని 11వ వార్డు భాస్కర్‌గడ్డలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నిరుపేదలకు ఇండ్లునిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో 2020లో నాటి బీఆర్ఎస్ సర్కారు భాస్కర్‌గడ్డలో 416 డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించింది. వీటిని కేటాయించేందుకు 2020 నుంచి 2023 వరకు దరఖాస్తులు స్వీకరించింది. దరఖాస్తులను జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ప్రభుత్వ అధికారులతో పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి, 392 మంది అర్హులైన నిరుపేదలను గుర్తించారు. వీరికి కలెక్టర్ సమక్షంలో డ్రా పద్ధతిలో బ్లాక్ నంబర్‌తో పాటు ఇంటినంబర్లు కేటాయించారు. ఇంతలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో ఇళ్ల పట్టాలు ఇవ్వలేదు. కోడ్ ముగిశాక ఇస్తామని నాడు జిల్లా కలెక్టర్ చెప్పినా నేటికీ అమలు కాలేదని లబ్ధిదారులు నూతి రమేశ్, బండి కుమార్, తాటికొండ సమ్మక్క తెలిపారు. అనంతర పరిణామాల్లో కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి రావడంతో గిట్టని కొందరు స్థానిక ఎమ్మెల్యేకు తప్పుడు సమాచారం అందించారని వారు వివరించారు. దీనిని నమ్మిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గతంలో అధికారుల సమక్షంలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆరు నెలలుగా ఎమ్మెల్యేతోపాటు కలెక్టర్‌ను కలిసి మొరపెట్టుకున్నా దాటవేస్తూ వచ్చారని తెలిపారు. ఇందులో అర్హులు లేరని, రీ సర్వే చేసి లబ్ధిదారులకు ఇస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా పట్టాలు ఇవ్వకపోడంతో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల తాళాలు పగులగొట్టి అందులోకి ప్రవేశించామని తెలిపారు. ఇప్పటికైనా మా సమస్యను గుర్తించి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఎమ్మెల్యేను వారు కోరారు.

అధికారుల్లో సమన్వయలోపం క్రీడాకారుల్లో గందరగోళం

- **అస్తవ్యస్తంగా ఎస్జీఎఫ్ఐ ఆటల నిర్వహణ**
- **ఆదివారమూ ఎంపిక పోటీలు పెట్టడంపై మండిపాటు**
- **కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై క్రీడాకారుల ఆగ్రహం**

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 19 : కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆటల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్జీఎఫ్ఐ) నిర్వహణలో అధికారుల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. దీంతో క్రీడాకారుల్లో గందరగోళం నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఓ వైపు స్పోర్ట్ యూనివర్సిటీకి సన్నాహాలు చేస్తుండగా ఎస్జీఎఫ్ఐ ఆటల నిర్వహణలో ఇప్పటివరకు ఉన్న విధానాన్ని ఆచరించడంలో కూడా విఫలమైంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏదో కొన్ని మండలాల్లో ఆటలు నిర్వహించి ఎంపిక చేసిన వారికి ఆదివారం వరంగల్ నగరంలోని గణపతి ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో ఉమ్మడి జిల్లాస్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నారు. కాగా, గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆదివారం ఈ ఆటల పోటీలను నిర్వహించడంపై అందరూ మండిపడుతున్నారు. విద్యార్థులకు సోమవారం నుంచి సమ్మేటివ్ అసెస్మెంట్(ఎస్ఏ)-1 పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరిస్థితుల్లో ఆటలు ఆడించడం వల్ల విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కాలేక నష్టపోనున్నారు. 23 నుంచి రాష్ట్రస్థాయి పోటీలు ఉండడంతో ఆటలను నిర్వహించడంపై మండిపడుతున్నారు. ఎస్జీఎఫ్ఐ గేమ్స్ వరుసగా మండలం, జోన్, జిల్లా, ఉమ్మడి జిల్లాలు, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో నిర్వహిస్తారు. ఆటల పోటీల నిర్వహణకు పీఈటీ, పీడీలతో కోఆర్డినేషన్ సమావేశాలు నిర్వహించి షెడ్యూల్ నిర్ణయించాల్సి ఉంటుంది. ఆ తర్వాత షెడ్యూల్‌ను డీఈవోలకు పంపి నిర్వహణకు కోఆర్డినేట్ చేయాల్సి ఉంటుంది. కానీ కలెక్టర్, డీఈవో, జిల్లా స్పోర్ట్ సెక్రటరీ, పీఈటీ, పీడీల మధ్య సమన్వయం లేకపోవడంతో కనీసం షెడ్యూల్ లేకుండానే ఎవరికి వారు ఇష్టంవచ్చినట్లు నిర్వహించుకుంటున్నారు. మండల స్థాయిలో ఆడిన వారిని ఏకంగా ఉమ్మడి జిల్లా స్థాయికి పంపడంపై క్రీడాభిమానులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఆటల నిర్వహణపై కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారులు, ఎస్జీఎఫ్ ఐపై మండిపడుతున్నారు.

ఎవరి ప్రయోజనాల కోసం ఫైవ్‌మెన్ కమిటీ ?

వంటావార్పు కార్యక్రమంలో భోజనాలు చేస్తున్న డబుల్‌బెడ్రూం లబ్ధిదారులు

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఎవరి ప్రయోజనాల కోసం ఫైవ్‌మెన్ కమిటీ వేశారనీ పలువురు లబ్ధిదారులు ప్రశ్నించారు. తమ కేటాయించిన ఇండ్లకు పట్టాలివ్వాలని గత జూన్‌లో ధర్నా నిర్వహించగా భూపాలపల్లి మున్సిపల్ కమిషనర్ టీ రాజేశ్వర్, అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఫైవ్‌మెన్ కమిటీ సభ్యులు పరిశీలించి అర్హులందరికీ ఇండ్ల పట్టాలిస్తామని చెప్పారని లబ్ధిదారులు తెలిపారు. ఎమ్మెల్యేతోపాటు నాయకుల మాటలు నమ్మి నెలలు గడుస్తున్నా ఇండ్లకు పట్టాలివ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అద్దెలు చెల్లించలేక తమకు కేటాయించిన ఇండ్ల తాళాలు పగులకొట్టి ఇందులోకి వచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో డబుల్‌బెడ్‌రూమ్ లబ్ధిదారులు పందిళ్ల రమేశ్, చంద్రశేఖర్, ఎం పద్మ, ఎండీ ఆ